ప్రజాశక్తి
మంగళవారం 5 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పాలకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో ఖాళీగా ఉన్న 2 అంగన్వాడీ సహాయకుల ఉద్యోగాలు భర్తీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థులు సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయములో దరఖాస్తును పొంది, పూర్తి చేసిన ధరఖాస్తులను మార్చి 5నుంచి 14 సాయంత్రం 5గంటల్లోపు తమ కార్యాలయంలో అందజేసి రసీదును పొందవచ్చన్నారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలము తరువాత తెలియజేస్తామన్నారు. అంగన్వాడీ సహాయకులకు టెన్త్ తరగతి ఉత్తీర్ణులై, జులై 1,2024 తేది నాటికీ 21-35 ఏళ్ల మధ్య వయస్సు గల స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. రోస్టర్ లో కేటాయించిన కేటగిరీల మేరకు అభ్యర్థుల భర్తీ జరుగుతుందని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రక్త హీనతపై సంపూర్ణ అవగాహన అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రక్త హీనతపై గ్రామ స్థాయిలో సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో అమలు చేస్తున్న పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణ కార్యక్రమం (ప్రాజెక్టు ఫర్ రిడక్షన్ ఆఫ్ ఇన్ఫాంట్ మోర్టాలిటి రేట్ బిలో 10)పై వైద్య అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణకు ముఖ్యంగా రక్త హీనత నివారణపై దృష్టి సారించాలన్నారు. తల్లి గర్భం నుండే పర్యవేక్షణ ఉండాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి ఇంటా అవగాహన ఉండాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ సమావేశాల్లో విధిగా చర్చించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, రక్త హీనత కలిగిన వారు, బరువు తక్కువ, వయస్సుకు తగిన ఎత్తు లేకపోవడం తదితర కేసులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారం వారే తినేలా పర్యవేక్షణ చేస్తామని తీర్మానించాలని ఆయన సూచించారు. గ్రామ సచివాలయం పరిధిలో రక్త హీనత ఉన్న వారిని గుర్తించి దత్తత అధికారిని నియమించాలని చెప్పారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, వైద్యాధికారి సంయుక్తంగా బాధ్యత వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ ఎం, ఆశా, మహిళా పోలీస్ ఇంటింటా పర్యటించి రక్త హీనత కలిగిన వారిని గుర్తించాలని సూచించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు ఎనీమియా మానిటరింగ్ టూల్ యాప్ ద్వారా చేయాలని స్పష్టం చేశారు. 5,6 తేదీల్లో అన్ని గ్రామాల్లో సమన్వయ సమావేశం జరగాలని ఆదేశించారు. ప్రతి కేసును హై రిస్క్ కేసుగా పరిగణించి సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. పిల్లలకు శత శాతం టీకాలు వేయించాలన్నారు. టెలీ మెడిసిన్, కిల్కారి యాప్ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు గల అధికారులు, సిబ్బందికి ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి అవగాహన ఉండాలని ఆయన స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, పాచిపెంట ఎంపిడిఒ ఎం.లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టండి

జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టాలని పలువురు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలియజేస్తూ వినతి పత్రాలను సమర్పించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం కలెక్టర్ నిశాంత్ కుమార్ నేతృత్వంలో జరిగింది. ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, డిఆర్ఒ కె.హేమలతలతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ మేరకు ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 179 అర్జీలు అందజేశారు. అనంతరం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ఇన్ చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ వీరఘట్టం మండలం మాదవలసకు చెందిన దాసరి అలివేలు మంగమ్మకు హెల్మెట్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లాఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

పార్వతీపురంరూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే, వాటిపై చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కారం అందించడానికి పోలీసుశాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కుమార్ అన్నారు. ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల స్పందన ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్‌పి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖీ మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి, ఆ ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే, వాటిపై చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కరించడానికి పోలీసుశాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భర్త/ అత్తారింటి వేధింపులు, భూవివాదాలు, జాబ్ మోసాలు, ఇతర సమస్యలపై ప్రజలు వినతులను ఇచ్చారు. కార్యక్రమంలో 8 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఎస్బిసిఐ సిహెచ్. లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎలో...

సీతంపేట : తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు స్పందన వినతులు సమర్పించారు. సోమవారం గిరిజన స్పందన కార్యక్రమం ఐటిడిఎలో పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎగువ సీదిగూడ చెందిన నరేష్ నీరు సరఫరా చేయాలని విన్నవించారు. ఇప్పగూడకు చెందిన రాధమ్మ వితంతు పెన్షన్ ఇప్పించాలని, ఎర్ర కువ్వారి గూడకు చెందిన త్రినాథ్ విద్యుత్ స్తంభాలు వేయాలని, ఉయ్యాలగూడకు చెందిన బాలరాజు కిరాణా షాపు మంజూరు చేయాలని కోరారు. జల్లారకి చెందిన సంగీత సిహెచ్ డబ్ల్యుఒ ఉద్యోగం ఇప్పించాలని, గడబపేటకు చెందిన రోహిణి కుట్టుమిషన్ మంజూరు చేయాలని, వజ్జాయిగూడ చెందిన రామారావు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని విన్నవించారు.

సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సబ్ స్టేషన్ ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని గుమడాం లేఅవుట్ -5లోని ఇళ్లు, టిడ్కో ఇళ్లకు సంబంధించిన విద్యుత్ సరఫరా కోసం నిర్దేశించిన 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను సోమవారం డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. రూ.3.85 కోట్ల టిడ్కో నిధులతో నిర్మించిన సబ్ స్టేషన్ ప్రారంభంతో ఈ ప్రాంత వాసులకు విద్యుత్ నిరంతర సరఫరా సాగుతుంది.

టిడ్కో ఇళ్ల మీటర్లకు సెక్షన్ ఆఫీసులోనే దరఖాస్తు:ఎస్ ఇ ఎం.లక్ష్మణరావు

టిడ్కో ఇళ్లకు విద్యుత్ మీటర్ల కోసం స్థానిక సెక్షన్ ఆఫీసులోనే దరఖాస్తు చేసుకోవచ్చునని ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు చెప్పారు. పార్వతీపురం డివిజన్ కార్యాలయానికి వెళ్ళాల్సిన అవసరం లేదని చెప్పారు. ఒక కెవి సామర్థ్యం కలిగి వున్న మీటర్‌కు రూ.269 చెల్లిస్తే సరిపోతుందన్నారు. రెండు కెవి సామర్థ్యం మీటర్ల కైతే రూ.538 చెల్లించాల్సి వుంటుందని చెప్పారు. విజయనగరం జిల్లాలో జగనన్న లేఅవుట్‌ల్లో 29,156 మందికి విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మన్యం జిల్లాలో 9849మందికి విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వేసవిలో కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చంద్రప్పవలస వద్ద 10/16 ఎంవిఎ పవర్ ట్రాన్స్ ఫార్మర్ స్థానం లో 31.5ఎంవిఎ పవర్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీనివల్ల సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు ఓవర్ లోడింగ్ సమస్యలు వుండవని చెప్పారు. కార్యక్రమంలో ఎడిఇ రంగారావు,ఎఇ సింహాచలం పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి ఎన్నికల్లో మెప్పు పొందాలని చూస్తున్న బిజెపి ఆయన సిఫార్సులను అమలు చేయాలని సిపిఎం నాయకులు విమర్శించారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను మండలంలోని వెలగవలస పంచాయితీ ములగవలసలో సోమవారం గ్రామస్తులతో సిపిఎం నాయకులు విడుదల చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, మండల కమిటీ సభ్యులు పి.రాము మాట్లాడుతూ దేశంలో రైతాంగ సమస్యలపై అధ్యయనం చేసి, వారికి న్యాయం జరగాలంటే మద్దతు ధరకు చట్టం చేయాలని కేంద్రానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిందన్నారు. ఆ సిఫార్సులను బిజెపి తుంగలో తొక్కిందని, వ్యవసాయ సంస్కరణల వల్ల నష్టపోతున్న రైతులను ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం పోరాడుతుంటే, వాటిని పట్టించుకోని మోడీ ఓట్ల జిమ్మిక్కులు చేస్తూ, స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించారని విమర్శించారు. మోడీకి చిత్తశుద్ధి ఉంటే స్వామినాథన్ సిఫార్సులను దేశంలో ఇప్పటికైనా అమలు చేయాలని, బిజెపి వెనుక వెంపర్లాడుతున్న జనసేన, టిడిపి, వైసిపి మోసాలను ప్రజలంతా అర్థం చేసుకొని ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతాంగ హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేసే వరకు రైతులు, ప్రజలను కలుపుకొని ఆందోళన ముందుకు తీసుకెళ్తామని, రైతాంగమంతా ఇందుకు సిద్ధపడాలని కోరారు. కార్యక్రమంలో కొర్ర రాజు, కొర్ర రాములమ్మ, మహేష్ పాల్గొన్నారు.

ఉపాధిని దెబ్బతీసే యత్నాలను విరమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విఒఎల ఉపాధికి విఘాతంకలిగించే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ఎపి.వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ధర్మరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో పార్వతీపురం ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్లో ఈ మేరకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్.ఆర్ పాలసి అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, విఒల మెర్జ్ ఆపాలి, కొత్త విఒల విఓఎ లతో సహా అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, స్వావలంబన అమౌంట్ను తిరిగి సభ్యులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘాల నుంచి చెల్లించాల్సిన రూ.2వేల బకాయిలు చెల్లించాలని, విఒల మెర్జ్ వల్ల ఉపాధి కోల్పోయిన విఒఎలకు నష్ట పరిహారం ఇవ్వాలని, గుర్తింపు కార్డు, యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. పొదుపు మహిళలకు రూ.20 లక్షలకు జీరో వడ్డీ వర్తింప చేయాలని, డ్వాక్రా సభ్యులతో బలవంతపు కొనుగోళ్ళ చేయించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విఒఎలు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ చేస్తున్న విఒఎలు, సిఐటియు నాయకులు

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మహిళలు, విద్యార్థిని లు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దిశా డిఎస్పీ ఎస్ఆర్ హర్షిత అన్నారు. మహిళలపై అత్యాచారాల నిరోధ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పోస్కో, దిశా చట్టాలతో పాటు మహిళలపై జరిగే నేరాలు వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఆర్పిడబ్ల్యుఎ సంస్థ చైర్మన్ పీకే ప్రకాష్, దిశా పోలీస్ స్టేషన్ హెచ్‌సి లావణ్య, సిడబ్ల్యుసి మాజీ చైర్మన్ లక్ష్మ నాయుడు, కోఆర్డినేటర్ పివి ప్రసాదు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడే ఏకలవ్య పాఠశాల భవనాలు ప్రారంభం

కురుపాం : కురుపాంలో కొత్తగా నిర్మించిన పోలీసు స్టేషన్, ఏకలవ్య పాఠశాల భవనాలను ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొనున్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వికలాంగులు

సమస్యల పరిష్కారానికి వికలాంగుల ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్ పి ఆర్ డి)ఆధ్వర్యంలో వికలాంగులు ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కన్వీనర్ గవర వెంకటరమణ మాట్లాడుతూ పార్లమెంట్లో 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని ఆమోదించారు, కానీ హక్కుల పరిరక్షణ చట్టంలో ఉన్న అంశాలను మాత్రం నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగుల సమస్యలపై నిర్లక్ష్యం వ్యవహరించడం తగదని, పార్లమెంట్లో ఆమోదించిన వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు తక్షణమే ఇళ్లు మంజూరు చేయాలని, ప్రతి నెలా పెన్షన్ రూ.6వేలు మంజూరు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తూ, టాక్సుల్లో రాయితీలు కల్పిస్తూ, వికలాంగులకు ఫెన్షన్ పెంచాలంటే నిధుల్లేవని చెప్పడం విడ్డూరమని అన్నారు. ఢిల్లీలో రైతులు చేపడుతున్న ఉద్యమస్ఫూర్తితో వికలాంగుల సైతం హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆసరా పెన్షన్లు మంజూరుకు ప్రభుత్వం విధించిన ఆదాయ పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమిస్తున్న నామినేటెడ్ పోస్టుల్లో 5%శాతం వికలాంగులకు కేటాయించేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యతగా వికలాంగులకు అవకాశం కల్పించాలని, నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోసం ఎలాంటి షరతుల్లేకుండా రూ.10లక్షలు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో వికలాంగులు నక్క త్రినాథ, రాయిపల్లి భాస్కరరావు, అడివియ్య జానకి, దమయంతి, గౌతమి తదితర వికలాంగులు పాల్గొన్నారు.

పోడు పట్టాలివ్వాలని

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

పోడు పట్టాలివ్వాలని, గిరిజన భూ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 5న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాలకొండలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు మాట్లాడుతూ తరతరాలుగా పేద గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ బంజరు భూములకు డి పట్టాలు ఇవ్వాలని, అన్యాక్రాంతమైన పేదల పట్టా భూములు తిరిగి వారికే ఇవ్వాలని, కొండపోడు సాగు చేస్తున్న గిరిజనులకు ప్రతి కుటుంబానికి పదెకరాల వరకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్.నాగరాజు, ఎస్.సింహాచలం, ఎస్.పాపారావు, ఎస్.విశ్వనాథం, ఎస్.అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు, అన్యాక్రాంతమైన భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇందు కోసం ఈనెల 5న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ అంటివలస, తమ్మన్నదొరవలస, తుమ్మలవలస తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ జిల్లాలో తరతరాలుగా పేదలు గిరిజనులు సాగు చేస్తున్న ప్రభుత్వ బంజర భూములకు డి-పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన పేదల పట్టా భూములు తిరిగి వారికి ఇవ్వాలని, కొండపోడు సాగు చేస్తున్న గిరిజనులకు ప్రతి కుటుంబానికి పది ఎకరాల వరకు పోడు పట్టాలి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు వెంకటేశు, రామారావు, బలరాం, సుబ్బారావు, మంగులు, పోలినాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలంలో సర్వేలైన వారందరికీ పట్టాలు పంపిణీ చేయాలని, గిరిజనులు మధ్య తగాదాలు పెట్టి అన్యాయం చేసిన తహశీల్దార్, విఆర్ఒలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తలపెట్టిన కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండలంలోని భరణికివలస, పెద్దవలస లో ప్రచార నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు రాము, చిన్నయ్య పాల్గొన్నారు

సిఆర్‌పిఎఫ్ పోలీసుల కవాతు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ నుంచి గుమ్మ లక్ష్మీపురం వరకు సిఆర్పిఎఫ్ బలగాలతో కవాతు ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసుల విధులు బాధ్యతలు గుర్తు చేస్తూ ఈ కవాతు ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, ఎస్సై బి. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సరవభాషా వాలంటీర్లు

సవరభాషా వాలంటీర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సవర భాష వాలంటీర్లను కొనసాగించకపోవడంతో 50 గిరిజన గూడేల విద్యార్థులు చదువుకు దూరమయ్యారని, వెంటనే వారి కొనసాగింపునకు చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీమోహన్రావు డిమాండ్ చేశారు. సోమవారం పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో గల 50 గ్రామాలకు చెందిన సవర భాషా విద్యా వాలంటీర్లు తమను మార్చి, ఏప్రిల్ నెలల్లో కొనసాగించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న అనాలోచితం నిర్ణయం వల్ల 50 గ్రామాల (గూండలు) గిరిజన విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. చిన్న చిన్న సవర గూడల విద్యార్థులను భాషా వాలంటీర్లు సమీప రెగ్యులర్ పాఠశాలకు తీసుకెళ్ళి చదువు చెప్పే వారని, ఇప్పుడు వారిని కొన సాగించకపోవడం వల్ల చిన్న చిన్న సవరగూడల విద్యార్థులు బడికి వెళ్లకుండా ఊరిలో ఉండిపోతున్నారని అన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎస్ఎస్ఎం అధికారులతో మాట్లాడి సవర భాష వాలంటీర్లను ఈ కొనసాగింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొనసాగింపునకు చర్యలు చేపట్టని పక్షంలో ఈనెల 11న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని భాష వాలంటీర్ల సంఘం నాయకులు డుంబు వెంకటేష్ ప్రకటించారు.

సమస్యలు పరిష్కరించాలని టిఎలు వినతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఉపాధిహామీ చట్టం కార్యాలయంలో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక ఎంపిడిఒ ఈశ్వరరావుకు వినతిని అందజేశారు. అనంతరం సాంకేతిక సహాయకులు కూర్మారావు, ఐసి కృష్ణ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీల ప్రకారం ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు, పిఆర్‌సిలు పెంచుతామని హామీలిచ్చినా నేటికీ ఆ హామీని నిలబెట్టుకోవడంలేదన్నారు. తక్షణమే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మణ్, శ్రీదేవి, జానకి, శ్రీను వాసరావు పాల్గొన్నారు.

కురుపాం : ఉపాధి హామీ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలతో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒ ఎస్.అప్పారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ఉపాధి హామీ సిబ్బంది సమస్యలు తెలుసుకుని అన్ని శాఖలతోనే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అలాగే జీతాలు పెంపు కోసం గత నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నా కనీస స్పందన చూపలేదని అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టిఇలుగా గుర్తించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో విధులకు అయ్యామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఎస్.సురేష్ కుమార్, కె.సరళ, ఎం.విశ్వం, ఆర్.లక్ష్మిరమేష్, టి.ధనుంజయ, తేజవతి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న సిఒ అండ్ ఎఎ టెక్నికల్ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యంకు సమ్మె నోటీసు అందజేశారు. పదేళ్ల నుంచి తమకు అన్యాయం జరుగుతుందని, డిపిఒ గ్రేడ్స్‌లో ఫిక్స్ చేసి న్యాయం చేయమని ప్రభుత్వానికి, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని నాయకులు తెలిపారు. సమ్మె నోటీస్ ఇచ్చిన వారిలో ఎపిఒ జి.సత్యంనాయుడు, సిఒ, ఎఎ, టెక్నికల్ సహాయకులు ఉన్నారు.

సీతానగరం : ఎంపిడిఒకు వినతిని అందజేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

బాక్సింగ్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి -భామిని

విశాఖపట్నం లో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కె.శాంతికుమారి (రజతం), కె.దివ్యశ్రీ (కాంస్యం) పతకం సాధించారు.



విజేతలను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

విజేతలకు ప్రిన్సిపల్ రఘుపత్రుని శివకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఇలాగే ప్రతి రోజూ అభ్యసన చేసి, మరిన్ని పతకాలు సాధించేలా సన్నద్ధం కావాలని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ సోమేశ్, పిఇటి శివరాం, ప్రసాద్ ఉన్నారు.

వంతెన వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

జంబిరి గెడ్డ వద్ద వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జంబిరి గెడ్డ వద్ద వంతెన నిర్మించి గిరిజన రైతులు ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అధికారులను కోరారు. సోమవారం జంబిరి గెడ్డ వద్ద సంఘం నాయకులు, గిరిజన రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి వంతెన నిర్మాణం చేపట్టాలని ఐటిడిఎ పిఒకు, కలెక్టర్‌కు దరఖాస్తులు అందించి గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించుకున్నా నేటికీ పట్టించుకోకపోవడం లేదంటే గిరిజనులపై చిన్నచూపు చూడడమేనని అన్నారు. ఇదే గెడ్డ వద్ద ఇద్దరి గిరిజనులు కొట్టుకుపోయి ప్రాణాలు పోయావని గిరిజన ప్రాణాలంటే ప్రభుత్వానికి, అధికారులకు లెక్కలేదన్నారు. మామిడిమానుగూడా, చింతమానుగూడా, జంబిరి తదితర చిన్నచిన్న 12 గిరిజన గ్రామాలకు సంబంధించిన జంబిరిగెడ్డ ప్రవాహంలో మనుషులతో పాటు మూగజీవాలు కూడా మరణిస్తున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెననిర్మాణం చేపట్టి గిరిజన ప్రజల ప్రాణాలు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు బిడ్డక వెంకట్రావు, అనిల్ కుమార్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

దొంగతనాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై స్థానిక ఎస్సై అమ్మన్నరావు తన సిబ్బంది సహాయంతో మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే తప్పక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇటీవల కాలంలో ఖడ్గవలస జంక్షన్ వద్ద జరిగిన సంఘటనను ప్రజలకు తెలిపారు. అలాగే ఎవరైనా గ్రామాలు విడచి ఊరు వెళ్లినట్లయితే తమ ఇళ్లకు తాళాలు వేసుకొని ఇరుగుపొరుగు ఉన్న కుటుంబాలకు చెప్పి వెళ్లడం మంచిదని ప్రజలకు తెలిపారు. మహిళలెవరైనా ప్రయాణ సమయంలో బంగారు ఆభరణాలు ధరించుకొనేటప్పుడు పరిసరాలను పరిశీలించుకుని నడుచుకోవాలని తెలిపారు. వేసవిలో రాత్రి వేళల్లో ఇళ్లలో కాకుండా బయట నిద్రిస్తున్న వ్యక్తులు మెలకువతో ఉండాలని కోరారు. నిద్రించే సమయంలో బంగారు ఆభరణాలను భద్రత కలిగిన స్థలంలో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

జీవోలు వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కార్మికుల వేతనాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు సోమవారం కమిషనర్ ప్రసన్న వాణికి వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ సమ్మె కాలానికి వేతనం, పెంచిన వేతనాలకు సంబంధించిన జీవోలను ప్రభుత్వం విడుదల చేసినందున అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికులకు పరిహారం, వారి కుటుంబాలకు ఉద్యోగాలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సబ్బులు, నూనెలు, బట్టలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.రాముడు, టి.శంకరరావు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.

నాలుగోరోజు ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని శ్రీ సాయిరాం డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ క్యాంపు నాలుగో రోజు కార్యక్రమంలో భాగంగా అడ్డాపుశీలలో ధూమపానం, మద్యపానం వల్ల జరిగే చెడు ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. ప్రతి వీధిలో తిరుగుతూ నినాదాలు చేస్తూ ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించారు. దీంతో పాటు తాగే నీటిని అత్యధిక ఉష్ణోగ్రత వద్ద నీటిని వేడి చేసి, వడపోసి తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధి పెంట అప్పారావు, ప్రిన్సిపల్ జి.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారులు డి.దేవి, కళాశాల సిబ్బంది ఇ.సింహాచలం, పి.ఉమాదేవి, టి. ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒ చంద్రశేఖర్‌తో కోర్ కమిటీ సభ్యులు చర్చించారు. జిపిఎఫ్ పెండింగ్ బిల్లులు, ఇఎల్ఎస్, పిజిఎల్ఐ బిల్లులు, విద్యార్థుల హాజరు సిగ్నల్స్ సమస్య తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్ పాలక దేవానంద్, సభ్యులు పి.ప్రసాద్, ఎన్.గోపాల్, భగవాన్, ఎ.కృష్ణ, విశ్వేశ్వరరావు, భాస్కరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంతో విధులకు హాజరు కావాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

యూనిఫాంతో విధులకు హాజరు కావాలని ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. సచివాలయానికి వెళ్లిన, మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన యూనిఫాంతో రావాలని నిబంధనకు విరుద్ధంగా విధులు నిర్వహించరాదని, అధికారులిచ్చే సలహాలు పాటించి విధులు సక్రంగా నిర్వహించి ప్రజలు కు సేవలు అందించాలన్నారు.

కళా వేదికకు రూ .10 వేలు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న కళా వేదికకు అదే గ్రామానికి చెందిన గుడివాడ సూర్యనారాయణ కుమారుడు గుడివాడ హరినాథ్ రూ.10వేలు వితరణగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరరావుకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో సోమవారం అందజేశారు. హరినాథ్ గతంలో కూడా పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు, నిర్వహణకు రూ.50వేలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు పాఠశాల సిబ్బంది ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

విరతణను అందజేస్తున్న హరినాథ్

బాబు, పవన్‌వి మోసపూరిత హామీలు

నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో రాజన్నదొర, శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌వి మోసపూరిత గ్యారంటీలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసానికి సమీపంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మజ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో పాదయాత్ర సమయంలో సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలకు కట్టుబడి అమలు చేశారని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. పెద్దగెడ్డ, విఆర్ఎస్, ఆంధ్ర రిజర్వాయర్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం ఆయకట్టు చివరి భూములకు సాగునీరందించే ప్రయత్నం చేసిందన్నారు. 2014 ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని చెప్పారు. మరోసారి టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని ఆపార్టీ నాయకులు గెద్దల్లా దోచుకు తింటారని చెప్పారు. నియోజకవర్గంలో మండల, గ్రామస్థాయిలో నాయకుల మధ్య విబేధాలు వుండవచ్చునని, వాటిని పక్కన పెట్టి ఐదోసారి రాజన్నదొర గెలుపునకు కృషి చేయాలని కోరారు. వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తే విశాఖ రాజధాని అవుతుందని చెప్పారు. విజన్ విశాఖ పేరు త్వరలో సిఎం జగన్ పలు అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతారని చెప్పారు.

ఎన్నికల్లో హామీ లివ్వను, ఇస్తే మాట తప్పను: రాజన్నదొర

తాను ఎప్పుడూ ఎన్నికల్లో హామీలు ఇవ్వలేదని డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. ఒకవేళ ఇస్తే మాట తప్పకుండా అమలు చేస్తానని చెప్పారు. టిడిపి,జనసేన నాయకులు మరోసారి మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. పాచిపెంట మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలు నాయుడు మాట్లాడుతూ ఎంపిగా పోటీ చేస్తానని రాజన్నదొర మరోసారి చెప్పవద్దని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఐదోసారి రాజన్నదొరను గెలిపించుకోవడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మెంటాడ మండలం జయతి మాజీ సర్పంచ్ మీసాల అప్పలనాయుడు, కొంపంగి గ్రామ టిడిపి నాయకులు కె.అక్కునాయుడు వైసిపి లో చేరారు. వారికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కార్యక్రమంలో మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావునాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, మండల జెసిఎస్ కన్వీనర్ కళ్ళే పిల్లి త్రినాథ్ నాయుడు,పాచిపెంట సీనియర్ నాయకులు డోల బాబ్జీ, పి.చినబాబు, మెంటాడ మండల నాయకులు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.వేణుగోపాల కలెక్టరేట్ ఎఒగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో గుమ్మలక్ష్మీపురంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ బిఎస్ఎస్ సత్యనారాయణ కురుపాం బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అందరు అధికారులతో కలిసి పని చేస్తూ తమ బాధ్యతలు విధులు సక్రమంగా నిర్వహిస్తు ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా పనిచేస్తానని అన్నారు.

ఇంటర్ పరీక్షకు 849 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 849 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 10,184 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 9335 మంది హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగిందని అర్ఐఒ మంజులవాణి తెలిపారు.

విజయమే లక్ష్యంగా పనిచేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

2024 సాధారణ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బూత్ కన్వీనర్లు పని చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. సోమవారం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో పార్వతీపురం పట్టణ, మండల పరిధిలో గల బూత్ కన్వీనర్లతో సమావేశానికి ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎక్కడ లోటుపాట్లు ఉండరాదనే లక్ష్యంతో బూత్ కమిటీలను పక్కాగా నియమించామని, ప్రతి ఇంటితోను పార్టీ క్యాడర్ మమేకం అవ్వాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు కలిసి మేం సిద్ధం మా బూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు అంతా ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని, చేస్తున్న అభివద్ధిని వివరించి మరో నెల 15 రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయి పార్టీ పరిశీలకులు తూముల భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బూత్ స్థాయిలో ప్రజలను కలుసుకుని పార్టీతో వారిని, అనుసం ధానం చేసి అందరి మద్దతు కూడగట్టాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం భాగ్యశ్రీ, జడ్పిటిసి బలగ రేవతమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు భీమవరపు కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శివేంపల్లి గురురాజు, పట్టణ పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైస్ ఎంపిపిలు, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, ఎఎంసి వైస్ చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, పట్టణ, మండల జెసిఎస్ కన్వీనర్లు, స్టేట్ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సొంతింటి కల సాకారమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజా శక్తి -భామిని

పేదలకు ఇంటి స్థలాలు అందించడమే కాకుండా, వాటికి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు గృహ లబ్దిదారుడికి అందించిన ప్రభుత్వం వైసిపి స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నవరత్నాలు - అందరికి ఇల్లు పథకంలో భాగంగా ఇంటి స్థలాలు అందజేసిన లబ్దిదారులకు ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు సోమవారం అందించారు. మండలంలోని 305 మంది లబ్ధిదారులుకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో శత శాతం అమలుచేసి, పాఠశాలలు, వైద్య కేంద్రాలు మెరుగుపర్చామన్నారు. ఈ రోజు ప్రభుత్వం అడగకుండానే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తుందన్నారు. అన్ని విధాలా కుటుంబాలను అభివృద్ధి చేసి, రాష్ట్ర అభివృద్ధికి వైసిపి కట్టుబడి ఉందని, ప్రజలకు ప్రభుత్వం మంచి చేసింనే విషయం తెలుసునని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓటుతో మీ ఆమోదం తెలపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపిడిఒ కిశోర్ కుమార్, డిటి శేఖరం, టింగా అన్నజీరావు, గెల్లంకి రమేష్, పోతల మజ్జి, రొక్కం రమేష్, బొమ్మాలి సంజీవ్, వై సి పి కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం :మండల కేంద్రంలో 709 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తూ వారికి ఇంటి స్థలంతో పాటు ఇళ్లను మంజూరు చేయడమే కాకుండా వారికి ఇచ్చిన ఇంటి స్థలపై శాశ్వత హక్కు కల్పిస్తూ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఫీజులు భరించి వారికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించా పట్టాలను అందజేస్తుందన్నారు. అందరికీ మేలు చేసిన ఈ ప్రభుత్వాన్ని మీరు మనసారా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి మామిడి బాబ్జి, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరామల నాయుడు, తహశీల్దార్ జివి జనార్ధన, డిటి చిట్టమ్మ, రెవిన్యూ అధికారులు, మండల సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, లబ్ధి దారులు పాల్గొన్నారు.

వెల్లంగూడలో బాబు షూరిటీ

వెల్లంగూడ గ్రామస్తులతో మాట్లాడుతున్న నిమ్మక జయకృష్ణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని వెల్లంగూడ, శంభం పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది తెలుగుదేశం - జనసేన ప్రభుత్వమేనని, సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, ఇప్పటి నుండే పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పాలకొండ నియోజకవర్గంలో 2024లో టిడిపి జెండా ఎగుర వేసేలా ప్రతి కార్యకర్త, నాయకుడు, యువకులు, మహిళలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయుకులు నిమ్మక చిన్నారావు, మాజీ సర్పంచ్ కుండంగి బుల్లయ్య, హాస్పిటల్ కమిటీ మాజీ చైర్మన్ నిమ్మక నాగేశ్వరావు, సీనియర్ నాయకులు ఆరిక నాగభూషణ్, సీనియర్ నాయకులు నిమ్మక జంగమా, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, అరిక రాకేష్ క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్లు, యువత పాల్గొన్నారు.

కురుపాం : ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతోనే సాధ్యమని మండల కన్వీనర్ కెవి కొండయ్య అన్నారు. మండలంలోని గుజ్జువాయిలో ఇంటింటికి వెళ్లి చంద్ర బాబు మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ఇంటికి వెళ్లి ప్రజలకు పథకాలు యొక్క ఆవశ్యకతను వివరించి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, టిడిపి నాయకులు టెక్కలి దుర్గారావు, బిడ్డక యువరాజు, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

కోటవానివలసలో...

పార్వతీపురంరూరల్ : మండలంలోని అడ్డాపుశీల గ్రామపంచాయతీ కోటవానివలసలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర అధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబునాయుడు మేనిఫెస్టోలో విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు శతశాతం వసూలు చేయాలి

ప్రజావక్తి - సీతానగరం

గ్రామాల్లో ఇంటి పనులను శతశాతం వసూలు చేయాలని ఎంపిడిఒ ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను చూడాలన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారిని పిహెచ్‌ఇలో నమోదు చేయాలన్నారు. సచివాలయాల్లో ప్రత్యేక అధికారులు వాటిని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ పాల్గొన్నారు.



టిడిపి కండువా వేసే పార్టీకి ఆహ్వానిస్తున్న జగదీశ్వరి

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కుక్కిడిలో టిడిపి- జనసేన పార్టీలోకి కుక్కిడి, కొత్తగూడ, నేరేడు మానుగూడ, గాజులుగూడ, నిగరం గ్రామాల నుంచి వంద కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో టిడిపి-జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ మండలంలోని గిరిజనులంతా తన వెంట ఉండి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ఎన్నికలు ఎంతో కీలకమని గిరిజన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిస్తే గిరిజన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాగే తన గెలుపున గిరిజనులందరికీ చెందుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కట్రక మల్లేష్, మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, క్లస్టర్ ఇన్చార్జి వెంకట్రావు, యూనిట్ ఇన్చార్జిలు రవి, బిడ్డిక సుదర్శనరావు, అడ్డాకుల నరేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటికీ పోలియో చుక్కలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక పిహెచ్‌సి పరిధిలో గల ఉల్లిభద్రలో రెండో రోజు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా డిఐఒ నారాయణ, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సంతోష్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి ఇంటి ఇంటికీ వెళ్లి ఇంకా పోలియో చుక్కలు వేసుకోని వారు ఎవరైనా ఉన్నారా అంటూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి కోవాలని సూచించారు. అలాగే సిబ్బంది కూడా ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు దగ్గర ఉండి వేంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, ఉదయ కుమారి, వైద్య సిబ్బంది, కె.అనిత, మాలతి, అంగన్వాడీ సిబ్బంది లావణ్య, కల్పనా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : పల్స్ పోలియో కార్యక్రమం ఇంటింటి సర్వేను జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు బూర్జ, నిడగల్లు గ్రామాల్లో పరిశీలించారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఏవైనా కారణాలచే పోలియో చుక్కలు పొందని ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించేందుకు వైద్య సిబ్బంది సోమవారం ఇంటింటి సర్వే చేపట్టారు. సర్వేలో ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. అక్కడ పిల్లలకు పోలియో చుక్కలు వేసినవీ, లేనివీ పిల్లల వేలిపై మార్కింగ్ ద్వారా పరిశీలించారు. టాలీ షీట్‌లో వివరాలు తనిఖీ చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఇంట్లో ఐదేళ్లలోపు పిల్లలు ఎంత మంది ఉన్నారు, ఆదివారం పల్స్‌పోలియో పోలియో చుక్కలు వేయించారా, ఎవరైనా బయట ఊరు వెళ్ళారా, బంధువులు ఎవరైనా వచ్చారా, వారిలో పిల్లలు ఎవరైనా ఉన్నారా అని తెలుసుకున్నారు. సోమ, మంగళ వారాలు సర్వే కొనసాగించి టీకా పొందని పిల్లలను గుర్తిస్తే వెంటనే పోలియో చుక్కలు వేసి, వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పెదంకలాం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్, వైద్య సిబ్బంది నరసమ్మ, గౌరీశ్వరమ్మ,గాయిత్రి,ధరణి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తాకట్టు జగన్ చేతకాని పాలనకు నిదర్శనం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఐదేళ్లలో చేసిన రూ.10లక్షల కోట్ల అప్పులే కాకుండా తను నిత్యం కూర్చుండే సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టడం ఆయన చేతకాని పాలనకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు విమర్శించారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ అప్పు తెస్తే గాని జీతాలు చెల్లించలేని పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వం చేరుకోవడం సిగ్గుచేటన్నారు. రాబోవు ఎన్నికలకు మరిన్ని ఆకర్షక పథకాలను ప్రకటించి ప్రజలను మోసగించడానికి సిద్ధమవుతున్న జగన్ మాయమాటలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని అన్నారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పెట్టే నాయకుడని ప్రజలు తీవ్రంగా విశ్వసిస్తున్నారని ఆయన అన్నారు.

ఐటిడిఎ వద్ద పొర్జపైడీలు ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో వివిధ మండలాల నుంచి పొర్జ పైడీలు తమ సమస్య పరిష్కరించాలని ఐటిడిఎ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పైడి తెగది కుల సమస్య కాదని రాజ్యాంగపరమైన హక్కు అన్నారు. రాజ్యాంగంలో ఉన్న షెడ్యూల్ తెగలను యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పొరజ ప్రధాన తెగలో ఉన్న పైడి ఉప తెగను ఎస్టీలుగా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలు పొర్జ పైడి తెగకు అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగాల్లో పివిటిజిలుగా ఉన్న పొర్జలకు సోదర పివిటిజి ఆదివాసీలతో సమానంగా అవకాశాలు కల్పించాలి డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ కల్పనాకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గేదెల చిరంజీవి, జి.జీవన్‌కుమార్, మాజీ సర్పంచ్ సురాపాని రాజారావు, ఎ. సహదేవ్, జీవా, గంట రామనాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - భామిని

గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించి, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి, గిరిజనులకు మెరుగైన జీవనం అందించడమే వైసిపి లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. ఈ మేరకు జియ్యామణుగూడ నుండి బిచ్చమానిగూడ వరకు రూ.కోటీ 50 లక్షలతో చేపడుతున్న బిటి రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే గురండి నుండి నేరడి -బి వరకు రూ.60లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పల్లెల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, పల్లెలు అభివృద్ధికి బాటలు వేసింది వైసిపి ప్రభుత్వం అని అన్నారు. కావున మళ్లీ వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించి, సంక్షేమ పథకాలు కొనసాగించే బాధ్యత మీదేనని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి టి.సింహాచలం, వైస్ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, పాలవలస సర్పంచ్ బిడ్డిక సబిత, మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, వైసిపి నాయకులు బిడ్డికి తమ్మారావు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

దగ్ధమైన జీడి తోట

22 ఎకరాల్లో జీడిపంట దగ్ధం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలస, అరసాడ, శివరాంపురం రెవెన్యూ పరిధిలో ఆదివారం సుమారు 22 ఎకరాల్లో జీడి పంట దగ్ధమైనట్టు ఆర్ఐ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అగ్నికి దగ్ధమైన జీడి తోటలను ఆర్ఐ, ఆయా పంచాయతీల విఆర్‌ఒలు పరిశీలించారు. ఇంకా పూర్తి సమాచారం రెవెన్యూ రికార్డుల పర్యవేక్షణలో తహశీల్దార్ సమక్షంలో ప్రాథమిక నివేదిక తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. 22 ఎకరాల్లో రూ.11 లక్షల వరకు ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు సమాచారం. ఈ ప్రమాదానికి రోడ్డుకి ఇరువైపులా శెనగచేలకు నిప్పు అంటించి బాధ్యతారహితంగా ఉండడమే కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా నష్టపోయిన జీడిపంట రైతులకు ప్రభుత్వం తగిన సకాలంలో పారితోషకం సకాలంలో అందించాలని, ఎకరాకు రైతుకు సుమారు రూ.లక్షలు అందేలా ప్రభుత్వం చూడాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ అన్నారు.

విఆర్‌ఎల మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

విఆర్ఎల మండల నూతన కార్యవర్గం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎన్నికైంది. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం నూతన కమిటీ పనిచేయాలన్నారు. గ్రామ సహాయకుల సమస్యలపై నిరంతరం కష్టపడి పని చేయాలన్నారు. అనంతరం కార్యవర్గం ఎన్నిక కోవడం జరిగింది. అధ్యక్షులు బి.జోగులు, ఉపాధ్యక్షులుగా కె.జోగయ్య, కార్యదర్శి తోట నాగయ్య, ఉప కార్యదర్శి జి ఆనందరావు, కోశాధికారిగా పిల్లి కాశి అన్నపూర్ణశ్వరి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పట్టణంలో టిడిపి నేతల పర్యటన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయ్‌చంద్ర సోమవారం పర్యటించారు. పట్టణంలో 11వ వార్డు పరిధిలోని ముత్తవారి వీధి, నెయ్యిలవీధి, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కారిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బార్నాల సీతారాం మజ్జి వెంకటేష్ వల్లపు చిన్నారావు తో పాటుగా పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.